'ఆటా' పోటీల్లో ఎంపికైన కథ



# ద బగ్

-ఆనంద్

"గుడ్ మార్నింగ్ జంటిల్ మెన్... ఈరోజు మన మీటింగ్ ముఖ్యోద్దేశ్యం మన కంపెనీ సేల్స్ పెంచడానికి మనం ఇంకా ఏయే స్ట్రేటజీస్ డెవలప్ చెయ్యాలన్నది నిర్ణయించడం అని మీకందరికీ తెల్సు. మన ఇంపార్టెంట్ లైన్ ఆఫ్ ప్రోడక్ట్... 'ఫుల్ బోడీ మోనిటర్...' ఇవి ఈ రోజుల్లో చిన్న చిన్న నర్సింగ్ హోమ్‌ల దగ్గరనుండీ పెద్ద పెద్ద కార్పొరేట్ హాస్పటల్స్ వరకూ ఉన్నాయి. దీనిని చిన్నతరహా రోగుల జ్వరం, బీపీ. హార్ట్‌బీట్‌లు తెల్సుకొందుకి ఉపయోగించడం దగ్గరనుండీ ఆపరేషన్ థియేటర్ లలో మనిషి పరిస్థితి తెల్సుకొందుకి అంటే మనిషిలో సరి పోయే రక్తం ప్రవహిస్తోందా? లేదా. ECG ఎలా ఉంది. ECGలో ఏమైనా తేడా వచ్చిందా? ఒకటేమిటి మనిషి ఆరోగ్య పరిస్థితి కూలంకషంగా తెల్సుకొందుకి ఉపయోగిస్తున్నారు. ఈ మెషెన్ వలన డాక్టర్లమీద ప్రెజర్ తగ్గింది. ఆపరేషన్ థియేటర్లో నిముష నిముషాన్కి మనిషి పరిస్థితి ఎలా ఉందో అని ఫిజికల్‌గా మెజర్‌మెంట్స్ తీసుకోవల్సిన అవసరం లేకపోయింది. కొన్ని ప్రైవేటు నర్సింగ్ హోమ్‌లు ఆపరేషన్ థియేటర్లలో డాక్టర్ల సంఖ్యని కూడా తగ్గించేసాయి. నాకు తెల్సు. ఇది మీకందరికి తెల్సని, అయినా ఎందుకు చెప్తున్నానంటే మన మైన్ ప్రోడక్ట్ ఎంత స్ట్రాంగో చెప్పడానికే. అలాంటి మిషన్ని మన ప్రోడక్ట్ కాటలాగ్‌లో ఉంచుకొని మనం దాన్ని ప్రోపర్‌గా కేష్ చేసుకోలేకపోతున్నాం..." అంటూ ఇంకా ఏదో చెప్పబోతున్న జగన్నాధాన్ని మధ్యలో ఆపి అందుకున్నాడు చంద్రశేఖర్... తన తప్పులేదని చెప్పడాన్కి మేనేజర్ (సేల్స్) హోదాలో.

"సర్... మన ప్రోడక్ట్స్ లాస్టియర్ సేల్స్ 10,000. అప్పుడే ఆగస్టులో మనం 7,000 దాటి అమ్మగలిగాం... ఈ ఏడాది ఖచ్చితంగా మనం 20,000 చెయ్యగలం అన్నది నా నమ్మకం".

"ఒకే... మీ పోయింట్‌ని ఎందుకు కొట్టెయ్యాలి...? మొత్తం దేశంలో ఫుల్ బోడీ మోనిటర్స్ ఎన్ని అమ్ముడవుతున్నాయి?"

"దాదాపు ఒక లక్ష"

"మనం 10,000 అమ్ముతున్నాం. మిగిలిన 90,000లూ"

"ఆల్ఫా బయో మెడికల్ ఇన్‌స్ట్రుమెంట్స్ 70,000 మెషీన్స్ అమ్ముతోంది. మిగిలిన 20,000ల మెషీన్లు దేశంలో మిగిలిన 5 కంపెనీలు కలిపి అమ్ముతున్నాయి."

"అదే నేనంటున్నది. మనం 10,000 మాత్రమే అమ్మగలిగినప్పుడు ఆల్ఫా బయో మెడికల్ ఇన్‌స్ట్రుమెంట్స్ 70,000 ఎలా అమ్మగల్గుతోంది."

"ప్రోడక్ట్స్‌లో వాళ్ళదీ పెద్ద డిఫరెన్స్ లేదు. కాకపోతే వాళ్ళ సర్వీస్ మన సర్వీస్‌కన్నా బాగుంది."

"అంటే మన మెషీన్‌లు సరియైన అప్ టైం ఇవ్వలేకపోతున్నాయా...?"

"అది కాదు సర్...! ఈ మెషీన్‌లలో పెద్ద 'నాలెడ్జ్ బేస్' ఉంది. దానిని ఉపయోగించి చాలా కేలిక్యులేషన్సు మెషీన్ తనంతట తనే చేసేస్తుంది. దాని మీద కంటిన్యువస్ రీసెర్చ్ చేస్తూనే ఉంటాం. మనమూ చేస్తున్నాం వాళ్ళూ చేస్తున్నారు. ఈ రీసెర్చ్‌వల్ల అప్‌డేట్ అయిన డేటాబేస్ మెషిన్‌లోన్కి ట్రాన్స్‌ఫర్ చెయ్యడానికి మనం ఒక ఆన్‌లైన్ సర్వర్‌ని ఉంచాం. ఆ నంబర్‌కి ఆటోమేటిక్‌గా మెషీన్ ప్రతీరోజూ డయల్ చేసి ఛేంజెస్‌ని ట్రాన్స్‌ఫర్ చేసుకొంటుంది. దీనివల్ల అనాలసిస్ రోజురోజుకీ బాగుపడుతుంది."

"ఇది మనం కూడా చేస్తున్నాం కదా...? లేకపోతే మనం మరో పనిచేస్తే... మనమే రోజుకొకసారి డయల్‌చేసి ట్రాన్స్‌ఫర్ చేసేస్తే..."

"దానివల్ల ఒక డిజ్‌అడ్వాంటేజ్ ఉంది. ఎవ్వరైనా ఆ నంబరుకి డయల్ చేసి రాంగ్ డేటా... రాంగ్ ప్రోగ్రామ్... ఆర్ ఈవెన్ ఎ వైరస్ ప్రోగ్రాం లోడ్ చేసి సిస్టంని పని చేయకుండా చేయ్యొచ్చు..."

"ఇప్పుడు చెయ్యలేమా..."

"చెయ్యలేం. ఎందుకంటే... డయల్ చేసిన మెషీన్‌కే ఆ డేటా కానీ ప్రోగ్రాం కానీ ట్రాన్స్‌ఫర్ చేస్తుంది ఆన్‌లైన్ సర్వర్."

"సరే...! ఇంతకీ అసలు విషయం వదిలేసాం. మన మెషీన్లు రోజుకొకసారి మన డేటాబేస్‌ను డౌన్‌లోడ్ చేసుకొంటాయి. అలాంటప్పుడు తేడా ఎక్కడుంది?"

"అఫ్‌కోర్స్... వాళ్ళ లెవల్ ఆఫ్ రీసెర్చ్... మేబీ... ఆఫ్ హయ్యర్ ఆర్డర్... ఇంక రెండోది... వాళ్ళ లేండ్‌లైన్... డెడ్ అయినా ఎంగేజ్ అయినా... వాళ్ళ మెషీన్ సెల్ నెంబరుకు డయల్‌చేసి డౌన్‌లోడ్ చేసుకొంటుంది. మనకి స్టాండ్‌బై సెల్ లేదు."

"స్టాప్... స్టాప్...! ఏంటీ సెల్‌ఫోనా...? అంటే వాళ్ళ లేండ్‌లైన్ డెడ్ అయితే అన్ని సిస్టమ్సు సెల్‌ని ఏక్సస్ చేస్తాయా...?"

"యస్ సర్."

"మనం ఆ సెల్‌ని టేప్ చేసే అవకాశం లేదా...?"

"చెయ్యొచ్చు ఆ ఫ్రీక్వెన్సీ అవీ తెలిస్తే... మనం దాన్ని టేప్ చెయ్యొచ్చు. కానీ ఎందుకు...? దానివల్ల ఉపయోగం...?"

"ఒకవేళ ఆల్ఫా వాళ్ళ లేండ్‌లైన్ డెడ్ అయిపోయి అన్ని మెషీన్లు డేటా అప్‌డేషన్ కోసం సెల్‌ని కాంటాక్ట్‌చేస్తే ఆ సెల్‌కు బదులు మనం డేటా అప్‌డేట్ చేస్తే అందులో ఒక వైరస్."

"స్టాపె ఇట్ సర్...! ఇట్ లుక్స్ యు ఆర్ గోయింగ్ టూ మేక్ ఆల్ ఆఫ్ అజ్ క్రిమినల్స్...! సారీ సర్. ఇలాంటి ఆలోచనలు సరదాకి కూడా రానివ్వకూడదు" అన్నాడు చంద్రశేఖర్ సీరియస్‌గా. దాంతో ఒక్కసారిగా తన మొహంలో రంగులు మార్చుకొని మామ్మూలు అయిపోయినట్లు నటించి

"ఒకే... ఒకే...! డోన్ట్ టేకిట్ సీరియస్... మనందరం రేపటికల్లా మన స్ట్రేటజీని ఛాకౌట్ చేసుకోవాలి" అంటూ కుర్చీలోంచీ లేచాడు మేనేజింగ్ డైరెక్టర్ జగన్నాథం.

★ ★ ★

"సీ మిష్టర్ చంద్రశేఖర్... నిన్న మీటింగ్‌లో చాలా వోవర్‌గా రియాక్ట్ అయ్యారు. కానీ ఆలోచించండి ఏదో ఒక డ్రేస్టిక్ స్టెప్ తీసుకోకుండా మనం ఆ కంపెనీతో పోటీ తట్టుకోలేం."

"నిజమే సర్... కానీ ఆ తీసుకొనే స్టెప్... స్ట్రైట్ ఫార్వర్డ్‌గా... లీగల్‌గా ఉంటే బాగుంటుంది."

"మనం ఇలా మడికట్టుక్కూర్చుంటే... ఒక జన్మ పడ్తుంది. వాళ్ళని రీచ్ అవడాన్కి."

"అలాగైతే ఒక హ్యూమన్ బాంబ్‌ని వాళ్ళ ఫాక్టరీ మీద వెయ్యచ్చు కదా...?" అన్నాడు చంద్రశేఖర్ వ్యంగ్యంగా.

"అఫ్‌కోర్స్... అది కూడా చెయ్యొచ్చు. కానీ అందులో రిస్క్ ఎక్కువ. అంతేకాదు మనం వాళ్ళ ప్రోడక్ట్ సరిగ్గా పనిచెయ్యడంలేదని రుజువు చేస్తే ఉన్న సిస్టమ్స్‌కు బదులు మన సిస్టంకు మారిపోవచ్చు ప్రతీ పెద్ద హాస్పటల్. దానివల్ల ఎక్కువ లాభం."

"సారీ సర్...! మీరేమైనా చెప్పండి నేనాపని చెయ్యలేను...! చేయించలేను...!"

"అది చెయ్యాల్సింది చేయించాల్సింది మీరు కాదు మేనేజర్ (సిస్టమ్స్). మీరు... మేంచేసిన ప్రోడక్ట్‌ని మార్కెట్ చెయ్యడమే."

"మార్కెట్ చెయ్యడమే కాదనను. కానీ ఇలాంటివి జరుగుతున్నాయని ఏజ్ ఏన్ ఇండివిడ్యువల్ కంప్లైంట్ చేసినా మన కంపెనీ మూతపడిపోతుంది."

"ఒకే... ఇట్సోకే..." అనేసి పంపించేసాడు చంద్రశేఖరాన్ని.

ఈ మాటలవల్ల జగన్నాధాన్కి అర్థమైంది... ఇది మేనేజర్ లెవల్లో అయ్యే పనికాదని. తను మేనేజర్ (సిస్టమ్స్)తో ఆ విషయం మాట్లాడటానికి జంకే సేల్స్ మేనేజర్ ద్వారా సాధిద్దామనుకొన్నాడు. కానీ వాడూ కొరుకుడు పడలేదు. కానీ ఒకటి నిజం. ఇందులో మేనేజర్ల ఇన్వాల్వ్‌మెంట్ అక్కరలేదు. తను ఆ మీటింగ్ అయిన నాటినుండీ ఆలోచిస్తున్నాడు దీనికి తరుణోపాయం ఏంటని...? సిస్టమ్స్‌లో సంజయ్ అనే సీనియర్ ప్రోగ్రామర్ ఉన్నాడు. ఆతనికి ప్రోగ్రామింగ్ నాలడ్జ కావల్సినంత వుంది. డబ్బుకోసం... నీతి... న్యాయం అని పట్టుకొని వేళ్ళాడే రకం కాదు. తనిప్పుడు సీనియర్ ప్రోగ్రామర్... అతనికి నార్మల్ వేలో మేనేజర్ అయ్యే అవకాశం తక్కువ. మేనేజర్ పోస్టుకు నాలుగు లెవల్స్ కింద వున్న పోస్టు... సరిగ్గా టేకిల్ చేస్తే పనిజరగొచ్చు... వాడ్ని మేనేజర్‌ని చేస్తానని ఆశ చూపించో,

ఉద్యోగం తీసేస్తానని భయపెట్టో... వాడి చేత ఈ పని చేయించొచ్చు.

* * *

"గుడ్ మార్నింగ్ సర్..."అంటూ స్వింగ్ డోర్ తెరుచుకొంటూ బిక్కు బిక్కుమంటూ వచ్చిన సంజయ్‌ని "వెరీ గుడ్ మార్నింగ్" అంటూ సాదరంగా ఆహ్వానించాడు జగన్నాథం.

"వెల్ సంజయ్... నీ ప్రోగ్రామింగ్ కేపబిలిటీస్‌ని అందరూ మెచ్చుకొంటూ వుంటే నేనే స్వయంగా విష్ చేద్దామని పిల్చాను."

"థాంక్యూ సర్."

"చూడు సంజయ్ అందరికీ ఆపర్చ్యునిటీస్ రావు. వచ్చిన కొద్దిమందిలో 90మంది దానిని గ్రేబ్ చేసి సద్వినియోగం చేసుకోలేరు. నువ్వు మిగిలిన ఆ పది పర్సంట్‌లోని వాడివని నా నమ్మకం."

ఈ ఉపోద్ఘాతం దేనికో అర్థంకాక తికమక పడిపోయాడు సంజయ్. కాకపోతే ఆ మాటలు పోజిటివ్‌గా వున్నందుకు సంతోషించాడు.

"మన కంపెనీలో మేనేజర్ పోస్టు ఒకటి కొత్తది క్రియేట్ చెయ్యబోతున్నాం. మేనేజర్ (నాలెడ్జ్ బేస్). అఫీషియల్‌గా ఈ మేనేజర్ మన నాలెడ్జ్ బేస్ డెవలప్‌మెంట్, ట్రాన్స్‌మిషన్‌ని కంట్రోల్ చేస్తాడు. ప్రస్తుతం ఇది మేనేజర్ (సిస్టమ్స్) పర్వ్యూలో ఉంది. కమ్యూనికేషన్స్‌లో నీకున్న ఎర్లియర్ ఎక్స్‌పీరియన్స్‌ని కన్సిడర్ చేసి... నీ తెలివితేటల్ని... స్కిల్స్‌ని దృష్టిలో వుంచుకొని నీకిద్దామని నిర్ణయించుకొన్నాను."

"థాంక్యూ సర్ థాంక్యూ వెరీమచ్" అంటూ కాళ్ళమీద పడ్డంత పని చేసాడు సంజయ్.

"కానీ ఈ పోస్టులో చాలా రిస్క్ ఉంటుంది. కొన్ని మనకి నచ్చని పనులు చెయ్యాల్సి రావొచ్చు. మన అందరి మొదటి కర్తవ్యం మన కంపెనీని అభివృద్ధిచేసి నంబర్ వన్‌గా చెయ్యడమే... కానీ అన్ని పనులూ అందరూ చెయ్యలేరు. కొన్ని పనులు మనం మడికట్టుకొంటే కుదరవు. నువ్వు చెయ్యలేవేమో అని కొంచెం సందేహం ఉంది. ఏం చెయ్యాలో అర్థం కావడంలేదు."

"సర్ నాకా అవకాశం ఇచ్చి చూడండి... మీరు చెప్పిన పనులేమైనా... ఎలాంటివైనా... నేను సక్సస్‌ఫుల్‌గా చెయ్యలేకపోతే మీరు నన్ను రివర్ట్ చేసేయండి" అన్నాడు సంజయ్ ఆవేశంగా.

"అది సరేనయ్యా... కొన్ని విషయాలు సీక్రెట్‌గా చెయ్యాల్సి రావొచ్చు. కొన్ని లీగల్ కావని నీకన్పించొచ్చు. కొన్ని నిజంగానే కాకపోవచ్చు. కానీ చెయ్యాల్సి రావొచ్చు. నేను తప్పని పరిస్థితులలో కంపెనీకోసం చేస్తూంటాను. నాకిష్టం లేకపోయినా..."

"తప్పకుండా సార్... కంపెనీకోసం ఎలాంటి పనైనా చెయ్యడాన్కి వెనుకాడను."

"సరే... ఇప్పుడే చెప్తున్నాను నువ్విచ్చిన ఎస్యూరెన్స్‌వల్ల నిన్ను ప్రొమోట్ చేస్తున్నాను. నువ్వు నీ బాధ్యతలని నిర్వర్తించలేకపోతే... ఏ పనైనా చెయ్యలేకపోతే... తక్షణం నిన్ను మళ్ళీ సీనియర్ ప్రోగ్రామర్‌ని చేసేస్తాను... ఓకే..." అంటూ ఇంటర్‌కామ్‌లో పియ్యేని పిల్చి ప్రమోషన్ ఆర్డర్ డిక్టేట్ చేసేసాడు జగన్నాథం.

* * *

జగన్నాథం సంజయ్‌ని పిలిచాడు తన ఛాంబర్‌కి. పెరిగిన హోదాతో ఉక్కిరి బిక్కిరైపోతున్న సంజయ్ పరిగెట్టుకొంటూ వెళ్ళాడు.

"నేను మళ్ళీ చెప్పేదాకా ఎవ్వరినీ లోపలకి రానివ్వకు" అంటూ ప్యూన్‌కి ఆదేశాలు జారీచేసాడు జగన్నాథం.

"సీ మిస్టర్ సంజయ్... మన కంపెనీని నెంబర్‌వన్‌గా వుంచాలన్న ఏకైక లక్ష్యంతో మన బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ ఒక్క మాస్టర్ ప్లేన్ వేసారు. దానిని ఇంప్లిమెంట్ చేసే బాధ్యత నాకు అప్పగించారు. అందులో సాఫ్ట్‌వేర్ కాంపొనెంట్ నీకు అప్పగిద్దామని నేను నిర్ణయించుకొన్నాను."

"యస్ సర్... ఆ రిపోర్ట్ నాకిస్తే నేను స్టడీ చేసి ఇంప్లిమెంటేషన్ షెడ్యూల్ తయారుచేస్తాను."

"అంత శ్రమ నువ్వు పడక్కరలేదు. నువ్వు చెయ్యాల్సిన దల్లా... ఒక చిన్న ప్రోగ్రాం తయారు చేయించాలి. ఒక రిమోట్ నెట్‌వర్క్ సిస్టమ్. దాన్ని ఏక్సస్ చేసిన మెషిన్‌కి ఈ చిన్న ప్రోగ్రాంను ట్రాన్స్‌ఫర్ చేసి రన్ చేయించాలి. అది రన్ అయిన వెంటనే ఆ మెషిన్ మోనిటర్ చేస్తున్న పెరామీటర్లలో కొన్ని లేదా అన్నీ అవుటాఫ్ బౌండ్ వేల్యూస్ చూపించాలి.



'అంటే తనో వైరస్ ప్రోగ్రాం చెయ్యబోతున్నాడు. అది ఏ ప్రోగ్రామర్ అయినా గర్వించదగ్గ విషయం కాదు. కాకపోతే తన నాలెడ్జ్‌ని... తన కేపబిలిటీని ఋజువు చేసుకోవచ్చు. ఇది సరియైన పద్ధతా...? తను ప్రమోషన్‌కోసం వైరస్ ప్రోగ్రామర్ అయిపోవాలా?'

దానివల్ల ఆ సిస్టమ్ పనిచెయ్యడం లేదనిపించాలి. దాన్ని రిపేర్ చెయ్యడాన్కి వచ్చిన వాళ్ళు కూడా అది ఈ ప్రోగ్రాం చేసిన పని అని పసిగట్టకూడదు..."

నోరు వెళ్ళబెట్టుకొని వింటున్న సంజయ్ ఒక్కసారి ఈ లోకంలోకి వచ్చాడు 'అంటే తనో వైరస్ ప్రోగ్రాం చెయ్యబోతున్నాడు. అది ఏ ప్రోగ్రామర్ అయినా గర్వించదగ్గ విషయం కాదు. కాకపోతే తన నాలెడ్జ్‌ని... తన కేపబిలిటీని ఋజువు చేసుకోవచ్చు. ఇది సరియైన పద్ధతా...? తను ప్రమోషన్ కోసం వైరస్ ప్రోగ్రామర్ అయిపోవాలా?'

"ఏంటీ ఆలోచిస్తున్నావ్. నువ్వు చెయ్యగలవని నాకు తెల్సు. ఎన్నాళ్ళలో చెయ్యగలవ్...?"

'ఇది చెయ్యనంటే ఖచ్చితంగా తనని రివర్ట్ చేసేస్తాడు. మరెవడికో ఆ పోస్ట్ ఇస్తాడు. ఈ ప్రపంచంలో డబ్బుకోసం ఏపనైనా చేసేవాళ్ళు చాలామంది వున్నారు. తను చెయ్యనంటే అది ఆగిపోయే పనికాదు. కాకపోతే తనకి రావల్సిన డబ్బులు... ఇంకెవరికో పోతాయి. తనే ఎందుకు ఆ అవకాశం వినియోగించుకోకూడదు' అనుకుంటూ.

"ఎట్‌లీస్ట్... వన్ ఇయర్... ఇఫ్ ఎవ్విరిథింగ్ గోస్ వెల్"

"నో అంత టైం వేస్ట్ చెయ్యడం నాకిష్టం లేదు. నీకు కావలిస్తే మరో పదిమంది మంచి ప్రోగ్రామర్స్‌ని రిక్రూట్ చేసుకో..."

"ఓకే... కానీ మినిమం ఆరు నెల్లు పడ్తుంది. ఎందుకంటే ప్రోపర్ డీబగ్గింగ్ జరగకపోతే... అది మనం అనుకొన్నట్లు పని చెయ్యకపోవచ్చు ఫలితం వుండదు."

"ఓకే... ఆర్నెళ్ళు... ఎక్కువ టైమ్ అయినా... అది దాటి మాత్రం... నీ ప్రోజెక్ట్ వెళ్ళకూడదు... ముఖ్యమైన కోడింగ్ నువ్వే చేస్తేనే బాగుంటుంది."

"ఓకే... సర్ ఇంతకీ ఈ ప్రోగ్రాం... ఏ సిస్టమ్‌లోకి ట్రాన్స్‌ఫర్ చెయ్యాలి. ఎలా చెయ్యాలి అన్నది నాకైనా చెప్పకపోతే జరగదు."

"అల్లా... వాళ్ళ సిస్టమ్స్... వాళ్ళ లేండ్‌లైన్ డెడ్ కావడం వల్ల సెల్‌ని ఏక్సస్ చేస్తాయి. వాళ్ళ సెల్ చుట్టూ నోయిస్ సిగ్నల్ జనరేటర్‌ని, జామర్‌ని పెట్టి డిస్టర్బెన్స్‌ను క్రియేట్ చేసి... కాల్ అందకుండా చేస్తాం. దాన్ని మన సిస్టమ్ రిసీవ్ చేసుకొని ఆ ఇన్‌స్ట్రుమెంట్‌కి ఒక ప్రోగ్రాం పంపి దాన్ని బూట్ చేస్తుంది. ఎప్పుడైతే అది బూటయ్యిందో అప్పుడు అది మెజర్ చేస్తున్న పెరామీటర్లన్నీ తప్పుగా చూపిస్తుంది. తప్పుగా చూపించడం మన లక్ష్యం కాదు. అది తప్పని అందరికీ తెలియాలి. అది జరగడాన్కి మెజర్ చేస్తున్న పెరామీటర్లు తప్పని చెప్పే విధంగా సాధారణంగా ఉండే లిమిట్స్ దాటించి చూపించాలి. అంటే బోడీ టెంపరేచర్. ఏ 50C లేకపోతే 60C చూపించాలి. అర్థం అయ్యిందా...?"

"యస్... సర్. అలాగే అర్థమయ్యింది."

"సరే పని ప్రారంభించు..." అంటూ పొట్ట పట్టుకొని కుర్చీలో ఓ మూలకి ఒదిగిపోయాడు. జగన్నాథం ముఖంలో బాధని చూసి.

"ఏమయ్యింది సర్" అన్నాడు సంజయ్ కంగారుగా.

"ఏం లేదు ఈమధ్య నాకు పక్కలో విపరీతంగా నొప్పొడుతోంది. డాక్టర్లు స్కేనింగ్ ఏదో చేయించుకోమంటున్నారు. అల్సరో ట్యూమరో ఏదో..." బాధ పడ్తూనే చెప్పాడు.

"డాక్టర్‌ని పిలవమంటారా...సార్"

"అక్కరలేదు. తగ్గిపోతుందిలే భరించలేనంతగా లేదులే" అంటూ... తన మామ్మూలు పనిలో పడిపోయాడు జగన్నాథం.

* * *

ప్రతీరోజూ ఉదయం, సాయంత్రం వర్క్ ప్రోగ్రెస్ ఎంక్వైర్ చెయ్యడం దాన్ని ఏక్సలరేట్ చెయ్యడాన్కి తగిన ప్రయత్నాలు చెయ్యడం జరుగుతూనే వున్నా రోజురోజుకీ జగన్నాథం ఇరిటేట్ అయిపోతున్నాడు. సంజయ్‌కి టెన్షన్ పెంచేస్తున్నాడు. ప్రోగ్రాంలు రాయడం ఈజీయే... రాయించడం కూడా ఈజీయే. కానీ ప్రోగ్రామర్స్‌కి తమేం చేస్తున్నారో తెలియజెయ్యకుండా చిన్న చిన్న ముక్కలుగా ఇచ్చి దాన్నంతా పేరేజ్‌గా చెయ్యడం చాలా కష్టం. అంతేకాదు ఇదో వైరస్ ప్రోగ్రాం. అది సాధ్యమైనంత చిన్న ప్రోగ్రాం అయి ఉండాలి. లేకపోతే అందరికీ ఏదో ఫారిన్ ప్రోగ్రాం వర్క్ చేస్తోందని తెల్సిపోతుంది. అది చేసే పనులు సాధారణమైన కంప్యూటర్ యూజర్‌కి తెలియకుండా వుండాలి. ఒకటేమిటి కానీ ప్రస్తుతం అది నెమ్మది నెమ్మదిగా ఒక కొలిక్కి వస్తున్నది. కానీ ఎక్కడో అది అల్లరి పెట్టేస్తోంది. ఎంత క్లియర్ ఇన్‌స్ట్రక్షన్ ఇచ్చినా తనూహించిన విధంగా పెరామీటర్స్ అవుటాఫ్ బౌండ్స్ వెళ్ళడం లేదు. ఎందుకో... ఎంత తల బద్దలు కొట్టుకున్నా అర్థం కావడంలేదు. మధ్యలో ఈ జగన్నాథం. ఎంత మేనేజర్ పోస్టిస్తే మాత్రం ఈ ఆర్నెల్లలో అంత తినెయ్యాలా అనుకొంటూ తన ప్రోగ్రాంలో మునిగిపోయాడు సంజయ్. ట్రింగ్...ట్రింగ్ మంటూ ఫోన్ మోగేసరికి ఈ లోకంలోకి వచ్చాడు సంజయ్.

"హలో".

"సంజయ్... కమ్ టూ మై ఛాంబర్" అన్న జగన్నాథం మాటలు వినగానే అర్థమైంది. తనకింక ఈ ప్రోగ్రామ్ డీబగ్గింగ్‌కి టైం దొరకదని.

"యస్ సర్ వస్తున్నాను."

నెమ్మదిగా తలుపుతెరుచుకొని లోపలికి వెళ్ళాడు సంజయ్.

"మిస్టర్... సంజయ్... దీసీజ్ షేమ్ ఆన్ యువర్ పార్ట్... నీకిచ్చిన టైం అయిపోయింది. ఇంకా నీ ప్రోగ్రాం తయారు కాలేదు. ఎంతవరకు వచ్చింది? కనీసం ఈవారంలో మనం అప్‌లోడ్ చెయ్యొచ్చా...?"

"సారీ... సర్ కనీసం టూ వీక్స్ పడుతుంది. నిజం చెప్పాలంటే డీబగ్గింగ్‌లో టైం ఇంత పడ్తుందని చెప్పడం కష్టం. ఒక్కప్పుడు ఒక గంటలో తేలిపోవచ్చు. లేకపోతే సంవత్సరాలు పట్టొచ్చు."

"చేసే వైరస్ ప్రోగ్రాంకి డీబగ్గింగ్ ఒకటి... ఆ బగ్ ఏదో వుంటే వచ్చిన నష్టం ఏంటి?" అన్నాడు చిరాగ్గా.

ఒకసారి తనమీద తనకే అసహ్యం వేసింది సంజయ్‌కి

(మిగతా 12వ పేజీలో)

(9వ పేజీ తరువాయి)

వైరస్ ప్రోగ్రామింగ్ చేయడం ప్రారంభించిననాడే తన విలువేమిటో తనకి అర్థం అయిపోయింది. ఈరోజు ఎం.డి. అది మొహంమీద చెప్పాడు. కానీ మరి వెనక్కి వెళ్ళలేని పరిస్థితి. ఏం చెయ్యడం. ముందీ రూంనుండీ బైటపడాలి.

"ఒక వారంలో ఇచ్చేయడానికి ట్రై చేస్తాను సార్" అన్నాడు సంజయ్.

"వారం కాదు... ఈరోజు పద్దెనిమిదో తారీఖు... ఇరవయ్యో తారీఖు రాత్రి 8 గంటలకి మనం దాన్ని మన కంప్యూటర్‌లో ఇన్‌స్టాల్ చేస్తాం. ఆరోజు సాయంత్రం నుండీ వాళ్ళ లేండ్‌లైన్ పని చెయ్యకుండా చేయించడాన్కి ఏర్పాటు చేసాను. వాళ్ళ కాంపౌండ్‌లో నోయిస్ జెనరేటర్‌ని ఆన్ చేయడాన్కి ఏర్పాట్లు కూడా జరిగాయి. నీ ప్రోగ్రాం ప్రోపర్‌గా పనిచేస్తే... మనం ఆన్ చేసిన దగ్గరనుండీ మన కంప్యూటర్ కాల్స్ రిసీవ్ చేసుకొని... మన వైరస్‌ని అప్‌లోడ్ చెయ్యాలి. అండర్‌స్టాండ్. సరిగ్గా విను... ఏదో ఒకటి రెండు బగ్స్ వున్నా నష్టం లేదు. ఆరోజుకి కంప్లీట్ సిస్టం పనిచేసేటట్లు ఉండాలి."

"యస్ సర్. కానీ ప్రస్తుతం ఉన్న బగ్‌వల్ల చాలా ప్రమాదాలు జరిగే అవకాశం వుంది" అంటూ ఇంకా చెప్పబోతున్న సంజయ్ మాటమధ్యలో కట్‌చేసి...

"నేను మరి వినదల్చుకోలేదు. ఇటీజ్ యువర్ రెస్పాన్సిబిలిటీ టూ సీ దట్ ద సిస్టమ్ ఈజ్ ఆన్ ఎండ్ ఆపరేషనల్... ఓకే" మరేం చేసేది లేక తన రూం చేరాడు సంజయ్.

'కనీసం చెప్పేది వినకుండా తరిమేశాడు. ఈ బగ్‌తో సిస్టంను ఆపరేషనలైజ్ చేస్తే హోల్ బోడీ మోనిటర్ పనిచెయ్యడంలేదన్న విషయం ఎవరికీ తెలియదు. అన్ని పెరామీటర్లు సరిగ్గా ఉన్నాయనుకొంటారు. మామ్మూలు చెకింగ్‌కి ఉపయోగిస్తే పరవాలేదు గానీ, ఆపరేషన్లు చేసేటప్పుడు డాక్టర్‌ని బాగా మిస్‌గైడ్ చేస్తుంది. పేషంట్ పరిస్థితిని ఏమాత్రం చూపించదు. దాంతో పేషంట్‌కి ప్రాణానికే ప్రమాదం. ఇది చెప్దామనుకొంటే వినే పరిస్థితిలో లేడు జగన్నాథం. ఇప్పుడు డీబగ్గింగ్ అని కూర్చుంటే అయ్యే పని కాదు. ఆపరేషనలైజ్ చెయ్యడానికి కనీసం రెండురోజులు పడ్తుంది' అనుకొంటూ తన పనిలో పడ్డాడు సంజయ్.

* * *

స్కేనింగ్ రిపోర్ట్‌లు తీసుకొని డాక్టర్ దగ్గరికి వెళ్ళాడు జగన్నాథం. రిపోర్ట్‌లన్నీ పరిశీలించి... ఓ అరగంట పరీక్ష చేసిన తర్వాత చావు కబురు చల్లగా చెప్పాడు డాక్టర్.

"మీ బ్రెయిన్‌లో ఒక ట్యూమర్ వుంది. దీనికి వర్రీ అయిపోవల్సిన అవసరం లేదు. ఇట్స్ స్మాల్ ఆపరేషన్... మీకు షుగర్... బీపీ వగైరా వున్నాయా...?

"ఇంతవరకూ లేవు."

"దెన్ ఇట్సోకే... అయినా మా ఫార్మలటీస్ కోసం మేం చెక్ చేస్తాం. ఇటీజ్ జస్ట్ హాఫ్ ఏనవర్ జాబ్... మీరు ఎల్లుండి ఇరవయ్యో తారీఖు జాయినవదల్స్తే మర్నాడు ఆపరేషన్ చేసేస్తాను."

"నో... ట్వంటీయత్... నాటెటాల్ పోజిబుల్... నాకో అర్జంట్ పని వుంది. ఆ మర్నాడు జాయిన్ అవుతాను."

"ఓకే... దట్స్ అప్ టూ యూ" అంటూ బై చెప్పేసాడు డాక్టర్.

* * *

ఆగస్టు 20 రాత్రి 8 గంటలు:

సంజయ్ అనుకొన్న విధంగా సిస్టంను రడీ చేసాడు. జస్ట్ ఇద్దరే మనుషులు సంజయ్, జగన్నాథం. కంప్యూటర్ ఆన్ చేసి ప్రోగ్రాం రన్ చేసాడు సంజయ్. స్క్రీన్ మీద ఒక సింగిల్ కమేండ్ బటన్ సిస్టం ఆన్ అని కన్పించింది. జగన్నాథం ఆ బటన్ని మౌస్‌తో క్లిక్ చేసాడు. అంతే... రెండు... మూడు బీప్‌లతో స్క్రీన్ రంగురంగులుగా మారిపోయింది. అది పని చేస్తోందో లేదో తెల్సుకోవడం ఎలా...!

వెంటనే సంజయ్ ఆల్ఫా బయోమెడికల్ ఇన్‌స్ట్రుమెంట్స్, లేండ్‌లైన్ నంబరు డయల్ చేసాడు. రింగ్ వెళ్తున్నది. ఎవ్వరూ ఎత్తలేదు. హేండ్ షేకింగ్ సిగ్నల్స్ కూడా రాలేదు. అంటే ఖచ్చితంగా అది డెడ్ అయివుంటుంది. వెంటనే సెల్



సంజయ్ అనుకొన్న విధంగా సిస్టంను రడీ చేసాడు. జస్ట్ ఇద్దరే మనుషులు సంజయ్, జగన్నాథం. కంప్యూటర్ ఆన్ చేసి ప్రోగ్రాం రన్ చేసాడు సంజయ్. స్క్రీన్ మీద ఒక సింగిల్ కమేండ్ బటన్ సిస్టం ఆన్ అని కన్పించింది. జగన్నాథం ఆ బటన్ని మౌస్‌తో క్లిక్ చేసాడు. అంతే...

నంబర్ కొంచెం టెన్షన్‌తో నొక్కాడు. ఒక్క క్షణంలో తన సిస్టం స్క్రీన్ మీద తన ఫోన్ నంబరు కన్పించింది. తన సిస్టం హేండ్ షేకింగ్ ఇన్ఫర్మేషన్ ఇస్తోంది. ఇంతవరకూ బాగానే వుంది. ఫోన్ క్రెడిల్ చేసాడు. ఏదో ఒక సిస్టమ్ డౌన్ లోడింగ్‌కి ఫోన్ చేస్తే తప్ప తనకి పూర్తిగా తెలియదు. తన సిస్టం పూర్తిగా పనిచేస్తోందని... గదిలో తనూ, జగన్నాథం... తప్ప మరెవ్వరూ లేరు. ఇద్దరికీ మాట్లాడే ధైర్యం లేక ఎవరి ఆలోచనల్లో వాళ్ళున్నారు.

ఆ క్షణంలో తన సిస్టం రియాక్ట్‌య్యింది. స్క్రీన్‌మీద ఒక నంబరు కన్పించింది JVG Cardiac Centre, విశాఖపట్నం అని కన్పించింది. ఇద్దరూ అలర్ట్ అయిపోయారు. సిస్టం వర్క్ చెయ్యడం ప్రారంభించింది. ట్రాన్స్‌ఫర్ ప్రోగ్రెస్ బార్ కన్పించింది. 100% కంప్లీట్ అంతే "వెరీ గుడ్...! కంగ్రాచ్యులేషన్స్" అన్నాడు జగన్నాథం. ఇద్దరూ ఆనందంతో ఉక్కిరిబిక్కిరై పోయారు. ఈపాటికి సిస్టం రీబూట్ అయి వైరస్ ఏక్టివ్ అయిపోయి వుంటుంది. కానీ అదెంతవరకు పనిచేస్తోందో... ఏమేం ప్రమాదాలు జరుగుతాయో అని భయపడ్డాడు సంజయ్.

* * *

ప్రొఫెసర్ శంభులింగం తన స్టూడెంట్స్‌తో ఆపరేషన్ థియేటర్లోకి చేరాడు. జగన్నాథాన్కి ఇవ్వాళ ఆపరేషన్ జరగబోతోంది. ఆ హాస్పటల్‌కి ఎటాచ్ అయిన మెడికల్ కాలేజ్ స్టూడెంట్స్‌కి ఇవ్వాళ ఆపరేషన్ గురించి నేర్పుదామని శంభులింగం తీసుకొని వచ్చాడు. స్టూడెంట్స్ అందరికీ ప్రిలిమనరీస్ క్లాస్‌లో చెప్పి తీసుకొచ్చాడు. ఎనస్థీషియా ఇచ్చి జగన్నాథాన్ని ఆపరేషన్ థియేటర్లో టేబుల్‌మీద పడుకోబెట్టారు. ఓపెన్ చెయ్యాల్సినచోట మార్క్‌చేసి మిగిలిన శరీరమంతా గ్రీన్ క్లాత్‌తో కవర్‌చేసి రడీ చేసారు. జగన్నాథం బోడీ నుంచి ఇరవై ముప్పై వైర్లు పక్కనున్న ఫుల్ బోడీ మోనిటర్‌కి తగిలించి ఉన్నాయి. లైట్లు ఆన్ చేసారు. ఆపరేషన్ ప్రారంభం అయ్యింది.

జగన్నాథం అచేతనంగా టేబుల్ మీద పడివున్నా తన బుర్ర పనిచేస్తూనే ఉంది. తన శరీరం మీద చెప్తున్న పాఠాలు ఏదో లీలగా వినిపిస్తూనే వున్నాయి.

"దీన్ని ఫుల్ బాడీ మోనిటర్ అంటారు దీన్ని ఆల్ఫా బయో మెడికల్ ఇన్‌స్ట్రుమెంట్స్ వాళ్ళు తయారు చేసారు."

ఒక్కసారి ఉలిక్కి పడింది అచేతనంగా వున్న జగన్నాథం బుర్ర. కానీ ఆ కదలికలేవీ బైటకు తెలియలేదు.

"దీనివలన మనకి పనులు చాలా తేలికైపోయాయి. B.P ECG, EEG ఒకటేమిటి అన్నీ మోనిటర్ చేస్తూ ఆపరేషన్ థియేటర్‌లో ఏ పెరామీటర్‌లో తేడా వచ్చినా... బీప్స్ ఇచ్చి ఎలర్ట్ చేస్తుంది. ఇది ఉండడంవల్ల పేషెంట్ సేఫ్టీ ఎక్కువైంది" అని ఒక్కొక్కటిగా అన్నీ అర్థం అయ్యేటట్లు చెప్పి ఆపరేషన్ ప్రారంభించాడు. బోడీ ఓపెన్ చేసిన తర్వాత... తననుకొన్నంత ఈజీ కాదని అర్థం అయ్యింది ఆ ఆపరేషన్. ఆ ట్యూమర్ చుట్టూ బ్లడ్ వెసల్స్ విపరీతంగా చుట్టుకొని వున్నాయి. ఏదైనా పెద్ద నరం తెగిపోతే బ్లడ్ లాస్... దాన్ని కంట్రోల్ చేయలేకపోతే చాలా కష్టం. అయినా ఫుల్ బోడీ మోనిటర్ ఉండడంవల్ల ధైర్యంగా ఉన్నాడు. ఎక్కడ మోనిటర్ బీప్ శబ్దం ఇస్తోందో అక్కడ నరాలు తెగాయని బ్లీడింగ్‌ని కంట్రోల్ చెయ్యొచ్చు. మోనిటర్... బోడీలోని బ్లడ్ ఫ్లో నార్మల్‌గానే ఉందని చూపిస్తున్నంతవరకూ ఏ ప్రోబ్లం వుండదు.

ఒక్కొక్క వీన్‌ను తప్పిస్తూ... జాగ్రత్తగా ట్యూమర్‌ని కట్ చేసాడు. మోనిటర్ వైపు చూసాడు. సంతోషంగా ఓ నవ్వు నవ్వుకొన్నాడు.

"శరీరంలో రక్తం ఫ్లో సఫిషియెంట్‌గా వుంది. కాబట్టి ఆపరేషన్ బాగా జరుగుతున్నట్లే"

"కానీ డాక్టర్ బ్లీడింగ్ ఎక్కువగా వున్నట్లుందే...!" అన్నాడో కుర్ర డాక్టర్ కాటన్‌తో బ్లడ్‌ని వొత్తుతూ.

"నో... మోనిటర్ నార్మల్ ఫ్లో చూపిస్తోందంటే ఎడిషినల్ బ్లీడింగ్ లేనట్లే. లేకపోతే బోడీలో ఫ్లో బిలో బోటమ్ బౌండ్... చేరి బీప్ ఇచ్చి వుండేది."

ఈ మాటతో మత్తులో వున్న జగన్నాథం... బుర్ర ఒక్కసారిగా రియాక్ట్‌య్యింది. బిలో బోటమ్ బౌండ్... నిన్న సంజయ్ చెప్పినదేమిటి...? ద బగ్... మేబీ రెస్పాన్సిబుల్ ఫర్ దిస్... తన బుర్రకి రక్తం సరిగ్గా అందుతోందని తనను కోవడం లేదు. నా వైరస్‌కి నేనే ముందు విక్టిమ్‌ని అవడాన్కి వీల్లేదు...! ఎలాగైనా...?

"ఓ...! ఇట్ లుక్స్ హెవీయాజ్ బ్లీడింగ్ టూ మచ్... చెక్ బ్లడ్ ప్రెజర్... మాన్యువల్లీ" అరిచాడు శంభులింగం.

"ఓ... మేజర్ వీన్... ఏదో కట్ అయినట్లుంది... క్విక్..."

"బ్లడ్ ప్రెజర్ ఈజ్ 70/40...!"

"వాట్ ద హెల్ ఆర్ యూ టాకింగ్ 70/40... వై దట్ బ్లడీ మిషన్ ఈజ్ షోయింగ్ 120/70...?" అంటూ బ్లీడింగ్‌ను స్టాప్ చేసే ప్రయత్నాల్లో పడ్డాడు శంభులింగం. శంభులింగం లాంటి సీనియర్ ప్రొఫెసర్... ఇంత చిన్న ఆపరేషన్‌కి అప్‌సెట్టయిపోయాడా...! ఆశ్చర్యపోయారంతా...! అందరికీ అర్థమైపోయింది... ఈ పేషంట్ మరి బతకకపోవచ్చుని...!

మిషన్‌ని తిడుతున్న శంభులింగం మాటలు నూతిలోంచి విన్పించినట్లు విన్పించాయ్ జగన్నాథానికి...! చెప్పడాన్కి విశ్వప్రయత్నం చేస్తున్నాడు. తనకి అర్థం అయిపోయింది. తను బ్రతకనని... కానీ మెషీన్‌ని నమ్మకపోతే బ్రతుకుతానని అనుకొంటూ చెప్పే ప్రయత్నం చేస్తూనే వున్నాడు. కానీ తన ప్రయత్నాలేవీ పైకి తెలియడంలేదు. ఉన్న శక్తి నశించిపోతోంది. తల వాల్చేశాడు జగన్నాథం.

* * *

('బగ్' అంటే కంప్యూటర్ పరిభాషలో పరిష్కరించబడని ప్రోగ్రామింగ్ దోషం (Unresloved Programming Error) అని అర్థం. మంచంలో నల్లులెలాగైతే ఒక పట్టాన వదలవో ఇవి కూడా ప్రోగ్రామ్స్‌ని వదలవని దానికా పేరు.) ★